
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 8 । జూలై । 2023



ప్రాణం తీసిన 'నేరేడు'

నేరేడు పండ్లు తినాలనే కోరిక ఓ బాలుడి ప్రాణాలు తీసింది. చెట్టు మీద నుంచి కింద పడి మృతి చెందాడు. 8లో



రోజుకో మొక్క..

సింగరేణి ఉద్యోగి రాజశేఖర్ రోజుకో మొక్క నాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాడు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 30°/ 25°

జిల్లాలో శనివారం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గోటి తలంబ్రాల వడ్లకు ప్రత్యేక పూజలు



పూజల అనంతరం వడ్లు అప్పగిస్తున్న అర్చకులు

భద్రాచలం: ఏపీలోని కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యాన శుక్రవారం భద్రాద్రి రామాలయంలో గోటి తలంబ్రాల వడ్లకు ప్రత్యేక పూజలు జరిపారు. ఏటా వడ్లు వేసి పండించిన ధాన్యాన్ని గోటితో ఒలిచి భద్రాచలంలో జరిగే శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి తలంబ్రాలుగా అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. సంఘం నిర్వాహకులు కళ్యాణం అప్పారావు ఆధ్వర్యాన అంబసత్రం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు. పండితులు లింగాల ప్రసాద్ అవధాని, ఎస్‌జీటీ కృష్ణమాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎల్.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

'రైల్వే'లో మజ్దూర్ యూనియన్ గెలుపు



క్యూలైన్‌లో ఓటర్లు

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ ప్యానెల్ గెలిచింది. ప్యానెల్‌లోని 9 మంది సభ్యులు విజయం సాధించారు. ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. మొత్తం 544 మంది ఓటర్లు ఉండగా, 469 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. బరిలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఉన్న విషయం విదితమే. హైదరాబాద్ నుంచి వచ్చిన రైల్వే ఏపీఓ జితేందర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, ఐదుగురు వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు సహకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైల్వే, వన్ టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ చేపట్టి రాత్రి 9:30 గంటలకు ఫలితాలు వెల్లడించారు.

ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తిచేయాలి

పాల్వంచరూరల్: ఈ నెల 15వ తేదీ నాటికి ఇంటింటికీ ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోపిట్ల నిర్మాణ పనులను పూర్తిచేయాలని డీపీఓ లక్ష్మీరమాకాంత్ ఆదేశించారు. మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పనులు, ఇంకుడు గుంతల పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మండలంలో తోగ్గూడెం గ్రామపంచాయతీని ఆదర్శ పంచాయతీగా ఎంపిక చేసినట్లు తెలిపారు. పంచాయతీ ప్రజలకు అవగాహన కల్పించి, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని చెప్పారు. సర్పంచ్ శాంతి, ఎంపీఓ బి.నారాయణ, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రేవతి, కార్యదర్శి బి.రవి, టీఏలు పాల్గొన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్..

బస్సు, లారీ ఢీ

- బస్సు డ్రైవర్ సహా ఓ ప్రయాణికుడు మృతి
- నలభై మందికి గాయాలు



ఘటనాస్థలంలో బస్సు, లారీ

అశ్వాపురం: అశ్వాపురం వద్ద శుక్రవారం అర్ధరాత్రి 12.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్–2 డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు గుంటూరు వెళ్తోంది. మణుగూరు దాటాక అశ్వాపురం మండల కేంద్రానికి సమీపంలోని మంచికంటినగర్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ, బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ సహా ఓ ప్రయాణికుడు అక్కడికక్కడే మృతి చెందారు. అంతేకాక బస్సులో ప్రయాణిస్తున్న మరో నలభై మంది ప్రయాణికులు కూడా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను భద్రాచలం, మణుగూరు, అశ్వాపురం ఆస్పత్రులకు తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, మృతుల వివరాలు, ఇతర సమాచారం తెలియాల్సి ఉంది.

రెవెన్యూ తీరే వేరు..

ఇల్లెందు పట్టణ నడిబొడ్డున విలువైన భూమి

- ఒకప్పుడు ఫారెస్ట్ శిక్షణా కేంద్రానికి వినియోగం
- ప్రస్తుతం రెవెన్యూ ఆధీనంలోకి 20 ఎకరాలు
- తిరిగి అటవీ శాఖకు ఇచ్చేందుకు ప్రయత్నాలు
- మరోవైపు స్థలం లేక ఆగిపోయిన ప్రభుత్వ భవనాల నిర్మాణం



గోవింద్ సెంటర్‌లోని ఫారెస్ట్ ట్రైనింగ్ స్కూల్ స్థలంలో కొనసాగుతున్న అటవీశాఖ కార్యాలయాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ఇల్లెందు రూరల్: ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల ఏర్పాటుకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ స్థలాల కొరత ఉంది. కొత్త భవనాల నిర్మాణం కోసం స్థలాలు సేకరించేందుకు అధికార యంత్రాగం ఆపసోపాలు పడుతోంది. ఇందుకు భిన్నంగా ఇల్లెందు పట్టణం నడిబొడ్డున 20 ఎకరాల రెవెన్యూ స్థలాన్ని... వివిధ ప్రభుత్వ భవనాలకు వినియోగించకుండా ఫారెస్టు శాఖకు అప్పగించేందుకు ఇక్కడి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

అటవీ శాఖ తొలిశిక్షణ కేంద్రం ఇల్లెందులోనే..

అటవీశాఖ 1969లో రాష్ట్రంలోనే తొలిసారిగా ఇల్లెందులో ఉద్యోగుల శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసింది. ఆ రోజుల్లో ఇల్లెందు చుట్టు పక్కల ప్రాంతాలన్ని సింగరేణి లీజులో ఉండేవి. అందులో ఒకటైన పట్టణ నడిబొడ్డున గోవింద్ సెంటర్ వద్ద ఖాళీగా ఉన్న స్థలంలో శిక్షణా కేంద్రం ప్రారంభమైంది. ఇక్కడ క్లాస్ రూమ్స్, స్టాఫ్ క్వార్టర్స్, హాస్టల్ బిల్డింగ్, వంటశాల, డైనింగ్ హాల్, ప్రధాన కార్యాలయం తదితర అవసరాలకు అనుగుణంగా భారీ భవనాలు నిర్మించారు. ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు సమీపంలో పదెకరాల్లో క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. 36 ఏళ్లపాటు ఇక్కడ ఫారెస్టు శిక్షణా కేంద్రం కొనసాగింది. ఆ తర్వాత ఏజెన్సీ ప్రాంతమైన ఇల్లెందులో ఉండేందుకు ఫారెస్టు ఉన్నతాధికారులు ఆసక్తి చూపలేదు. దీంతో కేంద్రాన్ని 2005లో దూలపల్లి (హైదరాబాద్)కు తరలించారు. అప్పటి రాజకీయ నాయకత్వం సైతం ఈ అంశంపై పెద్దగా పోరాడలేకపోయింది.

పట్టణం నడిబొడ్డున 16 ఎకరాలు..

ఫారెస్ట్ ట్రెనింగ్ ఇక్కడి నుంచి తరలిపోయిన తర్వాత అక్కడున్న భవనాల్లో కొన్నింటిని ఇల్లెందు, కొమరారం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాలకు వినియోగించారు. తాజాగా మంజూరైన అటవీశాఖ డివిజన్ కార్యాలయం కూడా ఇదే భవన సముదాయంలో కొనసాగిస్తున్నారు. కానీ మిగతా భవనాలను అటవీశాఖ కూడా పట్టించుకోకపోవడంతో అవి చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొంత భూభాగం కూడా ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం సుమారు 16 ఎకరాల స్థలం ఉంది. దశాబ్దాల పాటు ఇక్కడ ఫారెస్టు శాఖ కార్యకలాపాలు జరగడంతో ఈ స్థలం అటవీశాఖదే అనే భావన నెలకొంది. కానీ ఇది సింగరేణి లీజుకు తీసుకున్న స్థలమని తర్వాత కాలంలో తేలింది. పదేళ్ల కిందట 99 ఏళ్ల లీజు గడువు పూర్తి కావడంతో తమకు అక్కరకు రాని అనేక స్థలాలను సింగరేణి రెవెన్యూకు అప్పగించింది. ఈ క్రమంలో పట్టణం నడిబొడ్డున ఉన్న 20 ఎకరాల స్థలం రెవెన్యూ పరిధిలోకి వచ్చింది.

గురుకులాల భవనాలకు స్థలం లేదన్న రెవెన్యూ..

ఇల్లెందుకు మంజూరైన మైనారిటీ, సాంఘిక సంక్షేమ, వెనుకబడి తరగతుల గురుకులాలు ఇక్కడ భవనాలు లేక ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. పక్కా భవనాలకు నిధులు మంజూరైనా నిర్మాణానికి పట్టణ పరిధిలో గుంట స్థలం కూడా అందుబాటులో లేదని రెవెన్యూ అధికారులు గతంలో చెప్పారు. మరోవైపు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కూడా అద్దె భవనంలో కొనసాగుతోంది. తహసీల్దార్ కార్యాలయం కూడా ఇరుకు గదుల మధ్య నిర్వహిస్తున్నారు. ఇల్లెందుకు రెవెన్యూ డివిజన్ హోదా ఇవ్వాలనే డిమాండ్ ఉంది. భవిష్యత్‌లో మంజూరయ్యే విద్యాసంస్థలు, శిక్షణా కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, పరిశ్రమలు, ఇతర కార్యాలయాల నిర్మాణానికి పట్టణం నడిబొడ్డున ఉన్న స్థలం అనువుగా ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు. అలాంటి స్థలాన్ని ఫారెస్టు శాఖకు కేటాయించేందుకు దస్త్రాలను సిద్ధం చేస్తుండటం పట్టణ వాసులను విస్మయానికి గురిచేస్తోంది.

ముఖ్యమైన కార్యాలయాలన్నీ ఇక్కడే..

ప్రస్తుతం గోవింద్ సెంటర్‌కు అతి సమీపంలో తహసీల్దార్, మండల పరిషత్, మున్సిపల్, జీసీసీ, కోర్టు, డీఎస్పీ కార్యాలయాలు ఉన్నాయి. వీటితోపాటు ఇక్కడే బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు, బస్ స్టేషన్, మీసేవా కేంద్రాలు ఉన్నాయి. సింగరేణి క్వార్టర్లు, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ తదితర ముఖ్యమైన కార్యాలయాలు ఇదే ప్రాంతంలో ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన గోవింద్ సెంటర్‌లో సుమారు 20 ఎకరాల స్థలాన్ని అటవీశాఖకు అప్పగించడం ఎంతవరకు ప్రజా ఉపయోగకరమనే అంశం చర్చనీయాంశంగా మారింది.

అటవీశాఖకు ఇస్తారట..

మండల పరిధిలోని బోయితండా, పూబల్లి గ్రామపంచాయతీల పరిధిలో ఇటీవల రూ.4.89 కోట్లతో రెండు రోడ్లు మంజూరయ్యాయి. ఈ రెండు రోడ్లను అటవీశాఖ పరిధిలోని స్థలాల్లో నిర్మించాల్సి ఉంది. అటవీశాఖ స్థలాన్ని రోడ్ల నిర్మాణానికి ఉపయోగిస్తున్నందున ప్రత్యామ్నాయంగా రెవెన్యూ స్థలాన్ని అప్పగించాల్సి ఉంటుంది. అటవీశాఖకు అప్పగించేందుకు మరెక్కడా స్థలం లేనట్టు పట్టణం నడిబొడ్డున ఉన్న విలువైన స్థలాన్ని అటవీశాఖకు ఇచ్చేందుకు రెవెన్యూశాఖ సిద్ధమైంది. ఈ మేరకు ఇరు శాఖల మధ్య ప్రత్యుత్తరాలు సైతం జరిగాయి. స్థలాల అప్పగింత అంశం తుది దశకు చేరుకున్నట్టు సమాచారం.

ఎమ్మెల్యే గారు పట్టించుకోండి

గతంలో ఫారెస్ట్ స్కూల్ ఇక్కడినుంచి తరలిపోవడంతో పట్టణానికి తీరని నష్టం కలిగింది. గనుల సంఖ్య తగ్గడంతో సింగరేణి కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. ఇలాంటి తరుణంలో పట్టణ అభివృద్ధికి ఆశాకిరణం లాంటి రెవెన్యూ స్థలం ఫారెస్టు శాఖకు అప్పగించే విషయంలో ఎమ్మెల్యే హరిప్రియ జోక్యం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంతో ఇప్పటికే నాలుగెకరాల స్థలం అన్యాక్రాంతమైంది.

రాబోయే తరానికి రాకుండా..

- తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా నివారణపై ప్రభుత్వం దృష్టి
- రక్తహీనత విముక్తిలో పైలెట్ ప్రాజెక్ట్‌గా జిల్లా ఎంపిక
- ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు రక్త పరీక్షలు
- ఇప్పటికే 16 వేల మందికి పూర్తి చేసిన వైద్య సిబ్బంది
- బాధితుల సంతానానికి సంక్రమించకుండా చర్యలు



విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తొమ్మిది జిల్లాలను ఎంపిక చేసింది. అందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కూడా ఎంపికైంది. సికిల్‌సెల్ ఎనీమియా బాధితుల నుంచి తదుపరి తరాలకు రాకుండా నివారించాలని, చిన్న వయసులోనే వ్యాధిని అరికట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులకు తలసేమియా/సికిల్‌సెల్ ఎనీమియా క్యారియర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల రక్తనమూనాలు సేకరిస్తున్నారు. వారంలో నాలుగు రోజులపాటు పాఠశాలలు, కళాశాలల్లో పరీక్షలు చేస్తున్నారు. సికిల్‌సెల్ ఎనీమియా క్యారియర్ నిర్ధారణ అయితే విద్యార్థులకు వైద్యచికిత్స, మందులు ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ వ్యాధికి సంబంధించి రెండు రకాల లక్షణాలు కలిగి ఉంటారని, రక్త నమూనాలో ఎటువంటి మార్పులు లేకుండా ఉంటే నార్మల్‌గా, రక్తంలో తేడాలుంటే క్యారియర్‌గా గుర్తిస్తామని వైద్యాధికారులు చెబుతున్నారు. క్యారియర్‌గా గుర్తించిన వారికి వైద్య సేవలు అందించనున్నారు. జిల్లాలో 51 వేల మంది విద్యార్థులకు పరీక్షలు జరిపేందుకు వైద్య, ఆరోగ్యశాఖాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాకు 19 వేల రక్త పరీక్షల కిట్లు రాగా 3వ తేదీ నుంచి ఇప్పటివరకు దాదాపు 16 వేల మందికి పరీక్షలు నిర్వహించారు. రెండో విడతలో వచ్చే కిట్లతో మిగిలిన విద్యార్థులకు పరీక్షలు జరిపించనున్నారు.

చిన్న వయసులోనే గుర్తిస్తే..

తలసేమియా/సికిల్‌సెల్ ఎనీమియా మేనరిక వివాహం చేసుకున్న వారి పిల్లలకు సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉంటుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులు చెబుతున్నారు. వ్యాధి ఉన్న వారిని చిన్న వయసులో గుర్తించి చికిత్స అందిస్తే భవిష్యత్‌లో మళ్లీ సమస్య ఉండదనే పేర్కొంటున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివాసీ గిరిజనులు, మారుమూల గ్రామాల్లో ఉండే వారు ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతుంటారు. వారిని ప్రత్యేకంగా గుర్తించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రక్తహీనత ఉన్నట్లు గుర్తించిన వారికి ప్రభుత్వం మందుల కిట్లు కూడా పంపిణీ చేసే అవకాశం ఉంది.

16 వేల మందికి పరీక్షలు చేశాం

జిల్లాలోని పాఠశాల, జూనియర్ కళాశాలల విద్యార్థులకు తలసేమియా/సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ఇప్పటివరకు 16 వేల మందికి రక్త పరీక్షలు నిర్వహించాం. రెండో విడతలో వచ్చే రక్తపరీక్షల కిట్లతో మిగిలిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తాం.

– సుందర్‌రావు, జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి చికిత్స అందించేందుకు మంచి కార్యక్రమం ప్రవేశపెట్టింది. విద్యార్థులందరూ రక్త పరీక్షలు చేయించుకుని తలసేమియా/సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ చేసుకోవాలి. పాఠశాలల, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు సహకరించి విద్యార్థులందరికీ పరీక్షలు చేయించాలి.

– జేవీఎల్ శిరీష, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి

స్వర్ణకవచధారణలో రామయ్య..

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి మూలమూర్తులు శుక్రవారం భక్తులకు స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారుజామునే గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. ఆ తర్వాత నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం గావించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి అర్చకులు నిత్యకల్యాణం జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదలకు స్థలాలు, ఇళ్లు ఇవ్వాల్సిందే..



ఇల్లెందు జగదాంబ సెంటర్‌లో బైఠాయించిన నాయకులు, గిరిజనులు

బీఎస్ఎస్ఎం ఆధ్వర్యాన రాస్తారోకో

ఇల్లెందు: పేద ఆదివాసీ, గిరిజనులకు ఇంటి స్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేయడమే కాక సర్వే కోసం డబ్బులు డిమాండ్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం భారతీయ సర్వ సమాజ్ మహా సంఘ్(బీఎస్ఎస్ఎం) ఆధ్వర్యాన పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించగా ఇల్లెందు, టేకులపల్లి మండలాలకు చెందిన ఆదివాసీ, గిరిజనులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎస్ఎస్ఎం వర్కింగ్ ప్రెసిడెంట్ వర్సా వెంకన్న, జిల్లా అధ్యక్షుడు ఈసం రవి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈసం నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో వారసత్వంగా సంక్రమించిన నివాస స్థలాల్లో కేంద్ర ప్రభుత్వ అంత్యోదయ పథకం ద్వారా ఇళ్లు మంజూరయ్యే అవకాశమున్నందున సర్వే చేయాలని కోరితే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అంతేకాక డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా సర్వే చేయడంతో పాటు డబ్బులు డిమాండ్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనతో గంటపాటు వాహనాలు నిలిచిపోవటంతో సీఐ టి.కరుణాకర్ అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పగా శాంతించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాములు, ఈసం నర్సమ్మ, వర్సా మంగా, రచ్చ సుజాత, ముక్తి మల్లేష్, గుగులోతు రమేష్, నాగేష్, కృష్ణ, హరి, రాందొర పాల్గొన్నారు.

6668 @ రూ.55 వేలు

వేలంలో ఫ్యాన్సీ నంబర్ దక్కించుకున్న విప్ కాంతారావు



రిజిస్ట్రేషన్ కోసం ఫొటో దిగుతున్న విప్ కాంతారావు

భద్రాచలం: వాహనానికి ఫ్యాన్సీ నంబర్ కావాలని ఎవరైనా ఆశిస్తారు. ఇదే క్రమంలో పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు కూడా రూ.55 వేలు చెల్లించి 6668 నంబర్‌ను దక్కించుకున్నారు. విప్ ఇటీవల కొనుగోలు చేసిన వాహనానికి శుక్రవారం భద్రాచలం రవాణా శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆయనకు గతంలో అన్ని వాహనాలకు ఉన్న నంబర్ కావడంతో ఈసారి కూడా టీఎస్ 28ఎం 6668 కోసం ఆన్‌లైన్ వేలంలో పాల్గొని రూ.55 వేలకు దక్కించుకున్నారు. అనంతరం ఎంవీఐ తోట తిరుపతి ఆధ్వర్యాన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. బీఆర్ఎస్ నాయకులు కామిరెడ్డి రామకొండారెడ్డి, నక్క ప్రసాద్, పూజారి కృష్ణ, యాంపాటి సందీప్‌రెడ్డి, ఎండీ ఆదాం, సుగ్యాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కానుక..

- పాఠశాల పునర్నిర్మాణం చేపట్టిన పూర్వ విద్యార్థులు
- రూ.10 లక్షలతో భవన నిర్మాణ పనులు పూర్తి
- రేపు పాఠశాల ప్రారంభం



పూర్వ విద్యార్థులు నిర్మించిన పాఠశాల భవనం



పూర్వ విద్యార్థులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం సీఎస్ఐ పాఠశాలలో 1985లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు రెండేళ్లకోసారి జరిగే ముత్యాలమ్మ జాతరలో కలుసుకుంటారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకుని కష్టసుఖాలు పంచుకుంటారు. బాల్యస్మృతులు నెమరువేసుకుంటారు. ఈ క్రమంలో తాము చదువుకున్న పాఠశాల భవనం కూలిపోయి, జిల్లా పరిషత్ స్కూల్‌లోని ఓ గదిలో నిర్వహిస్తుండటంతో ఒకింత బాధపడ్డారు. తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలని తలచారు. అందరూ ఉన్నత స్థాయిలో ఉండటంతో తలా ఓ చేయి వేసి పనులు ప్రారంభించారు. మిత్రులను సంప్రదించి పూర్వ విద్యార్థుల ద్వారా సుమారు రూ.10 లక్షలు సేకరించారు. కేవలం నాలుగు నెలల్లో పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేశారు. విద్యుత్, తాగు నీటి సరఫరా, డెస్కులు ఏర్పాటు తదితర మౌలిక వసతులు కల్పించారు. ఈ నెల 9న ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. నిర్మాణంలో పూర్వ విద్యార్థి ఎండీ జానీపాషా కీలకంగా వ్యవహరించాడు. స్థానికంగా ఉన్న తన మిత్రులు యామన రాంబాబు, అహ్మద్, కమలాదేవి, కుప్పిలి చిట్టిబాబు సహకారంతోపాటు ఎక్కడెక్కడో ఉన్న మిత్రులతో సంప్రదింపులు జరుపుతూ పనుల నిర్వహణను పర్యవేక్షించాడు. భవన నిర్మాణం పూర్తి చేసి నేటి తరం విద్యార్థులకు కానుకగా ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల కృషిని పలువురు అభినందిస్తున్నారు.

'నైటింగేల్'కు మరో పురస్కారం

ఇండి గ్లోబల్ సర్వీస్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఏఎన్ఎం సుశీల

సూపర్‌బజార్(కొత్తగూడెం)/అన్నపురెడ్డిపల్లి: రాష్ట్రపతి చేతుల మీదుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న మద్దుకూరు ఏఎన్ఎం తేజావత్ సుశీలకు మరో అరుదైన పురస్కారం దక్కింది. ఇండి గ్లోబల్ మీడియా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాదులో శుక్రవారం రెండో ఇండి గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సుశీలకు సంస్థ ప్రతినిధులు ఇండిగ్లోబల్ ఎక్స్‌ంప్లరీ సర్వీస్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బందితో పాటు, పలువురు ప్రజాప్రతినిధులు ఆమెను అభినందించారు.

మొక్కలను సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

చుంచుపల్లి: హరితహారంలో భాగంగా నాటుతున్న మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ ఎం.విద్యాలత సూచించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సందర్భంగా నందతండా, రామాంజనేయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ గ్రామ పంచాయతీల్లో పర్యటించి నర్సరీలను సందర్శించారు. నర్సరీల్లో ఎదిగిన మొక్కల షిఫ్టింగ్, గ్రేడింగ్ నిర్వహించి, గ్రామాల్లో ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, బృహత పల్లె ప్రకృతి వనాల్లోనూ కొత్త మొక్కలతో గ్యాప్ ఫిల్లింగ్ చేయాలని చెప్పారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు పాటించాలని చెప్పారు. వర్షపు నీరు నిల్వ ఉన్నచోట తక్షణం ఆయిల్ బాల్స్ వేయాలని, సైడ్ కాలువలు పూడిక తీయాలని, బ్లీచింగ్ చల్లించాలని, ఫాగింగ్ చేయాలని సూచించారు. ఎంపీఓ గుంటి సత్యనారాయణ, నాగరాజు, రవికుమార్, అజ్మీర ఇందిరా, బొల్లం వసంత పాల్గొన్నారు.

ఐటీడీఏలో సీఆర్‌టీల కౌన్సెలింగ్ పూర్తి

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేసే సీఆర్‌టీల సర్దుబాటుకు సంబంధించి రెండు రోజులుగా జరుగుతున్న కౌన్సెలింగ్ శుక్రవారం పూర్తయింది. పీఎంఆర్‌సీ భవనంలో కౌన్సెలింగ్ ఐటీడీఏ ఏపీఓ జనరల్, ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్ పర్యవేక్షించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఆర్‌టీలను సీనియారిటీ ప్రాతిపదికన సర్దుబాటు చేయగా, ఐదేళ్లకు మించి సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు కేటాయించామని తెలిపారు. జిల్లాలోని 50 గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, కన్వర్టెడ్ పాఠశాలలకు సీఆర్టీలను నియమించినట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌లో ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు రూపాదేవి, చంద్రమోహన్, జీసీడీఓ అలివేలు మంగతాయారు, కార్యాలయ ఉద్యోగులు నారాయణ, రంగయ్య, సురేశ్, అఖిల్, ఈశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అమ్మవారి శుక్రవారం పంచామృతాభిషేకం జరిపారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూల విరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచ హారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, కమిటీ సభ్యులు కిలారు నాగమల్లేశ్వరరావు, చింత నాగరాజు, గంధం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

ఖమ్మంమయూరిసెంటర్: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శనివారం నిర్వహించనున్నారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగే వేడుకలను విజయవంతం చేయాలని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఖమ్మంలోని ధంసలాపురం, రాపర్తినగర్ ప్రాంతాలతో పాటు బూర్గంపాడు మండలం సారపాక, అశ్వాపురం మండలం రామచంద్రాపురంలోని వైఎస్సార్ విగ్రహానికి పొంగులేటి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. అలాగే, వైరాలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో ఉత్తమ ఫలితాలు

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకుల కళాశాల, పాఠశాల, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు గత మే నెలలో రాసిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 361 మంది పరీక్షలు రాయగా 172 మంది ఉత్తీర్ణులయ్యారని, 189 మంది విద్యార్థులు ఫెయిలయ్యారని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో 155 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 109 మంది ఉత్తీర్ణులుకాగా, 46 మంది ఫెయిలయ్యారని వివరించారు. 70 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. పదో తరగతిలో ఈఎంఆర్ఎస్ పాఠశాలలో 105 మంది పరీక్షలు రాయగా 94 మంది ఉత్తీర్ణులు కాగా, 11 మంది ఫెయిలైనట్లు, 91 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వివరించారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

గుండాల: విధులకు హాజరు కాకుండా ఉంటున్న ఉపాధ్యాయుడిని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు డీఈఓ శుక్రవారం సస్పెండ్ చేశారు. ఆళ్లపల్లి మండలం రాయిగూడెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న రామకృష్ణ విధులకు గైర్హాజరవుతున్నాడని, పాఠశాల నిధులు సొంతానికి వాడుకున్నాడని మూడు రోజుల కిందట గ్రామస్తులు ఎంఈఓ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విచారించిన ఎంఈఓ నివేదికను జిల్లా అధికారులకు అందించారు. దీంతో సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు.

జూదరులపై కేసు నమోదు

మణుగూరురూరల్: పేకాట ఆడుతున్న ఆరుగురిని మణుగూరు పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని గుట్టమల్లారం ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రాజ్‌కుమార్ దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు మొబైళ్లు, రూ.4,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజ్‌కుమార్ వివరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చంద్రుగొండ: మండలంలోని దామరచర్ల గ్రామానికి చెందిన గౌర కాటమరాజు (30) పురుగులమందు తాగగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ గొల్లపల్లి విజయలక్ష్మి కథనం ప్రకారం.. కాటమరాజు కొంతకాలంగా మధుమేహం వ్యాధితో బాధపడుతున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో మనస్తాపం చెంది గురువారం పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొత్తగూడెం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య రజని, పిల్లలు యామిని, నర్సింహారావు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

ఇప్పటికే ఆలస్యమైంది..!

ఈ ఏడాది మొదలుకాని హరితహారం

- మున్సిపాలిటీల్లోని నర్సరీల్లోనే ఎదుగుతున్న మొక్కలు
- ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో 15.09 లక్షల మొక్కలు నాటేలా ప్రణాళిక
- వర్షాలు కురుస్తుండడంతో ఈ నెల 14న ప్రారంభించేందుకు సన్నాహాలు



ఇల్లెందులోని మున్సిపల్ నర్సరీలో సిద్ధంగా ఉన్న రకరకాల పూల మొక్కలు

ఇల్లెందు: ఏటా జూన్ మొదటి, రెండో వారాల్లో మొదలయ్యే హరితహారం ఈసారి ఆలస్యమవుతోంది. ఇప్పటివరకు సరైన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అయితే వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్న నేపథ్యాన వచ్చే వారం నుంచి హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీల్లోని నర్సరీల్లో ఇప్పటికే మొక్కలు సిద్ధం చేశారు. కాగా, వర్షాల ఆలస్యంతో హరితహారం కూడా జాప్యం జరుగుతుండడంతో మొక్కలు నర్సరీల్లోనే ఏపుగా పెరుగుతున్నాయి.

ఏటా పండుగ వాతావరణంలో..

గతంలో హరితహారం పండుగ వాతావరణంలో నిర్వహించేవారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపిక చేసిన ప్రాంతాల్లో మొక్కలు నాటడం ఉత్సాహంగా జరగగా.. గతేడాది హంగూ ఆర్భాటం లేకుండానే కార్యక్రమం కానిచ్చేశారు. ఇక ఈసారి తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గత నెల 19న అక్కడక్కడా మొక్కలు నాటారు. కానీ, పూర్తిస్థాయిలో కార్యక్రమాన్ని వచ్చే వారం మొదలుపెట్టే అవకాశముందని సమాచారం.

ఈసారి పూల మొక్కలకే ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో హరితహారం ఒకటి. కొన్నేళ్లుగా నీడనిచ్చే మొక్కలకే ప్రాధాన్యత ఇచ్చారు. కొన్ని సార్లు గృహస్తులకు పండ్ల మొక్కలను పంపిణీ చేయడంతో పాటు కాలనీల్లో అంతర్గత రహదారుల వెంట కూడా నాటారు. కానీ, ఈసారి మాత్రం ఎక్కువగా పూల మొక్కలపైనే దృష్టి సారించారు. ముఖ్యంగా పట్టణాల్లో స్థలాల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీల్లో నర్సరీల కోసం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిధులు విడుదల చేయగా అనువైన స్థలాల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్లు వేసి మొక్కలు పెంచారు. ఆయా కాంట్రాక్టర్లు మొక్కలను సిద్ధం చేయడంతో త్వరలోనే హరితహారం కింద నాటేందుకు కసరత్తు చేపట్టారు.

కార్పొరేషన్/ మున్సిపాలిటీ	మొక్కల లక్ష్యం	సిద్ధంగా ఉన్న మొక్కలు
ఖమ్మం	5,84,540	3,04,100
కొత్తగూడెం	1,82,490	1,44,300
పాల్వంచ	2,27,260	88,000
మణుగూరు	1,59,610	45,000
సత్తుపల్లి	1,06,590	64,100
మధిర	93,940	93,940
వైరా	75,900	65,900
ఇల్లెందు	79,420	98,000
మొత్తం	15,09,750	9,03,340



ఏపుగా పెరిగిన నీడనిచ్చే మొక్కలు

ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు



ఇప్పటి వరకు నీడ, పండ్ల మొక్కలనే నాటాం. ఈసారి మాత్రం పూల మొక్కలకు ప్రాధాన్యత ఉంటుంది. ఇప్పటికే నర్సరీలో నాటేందుకు పూల మొక్కలు సిద్ధం చేశాం. ప్రతీ ఇంటికి ఆరేసి మొక్కలు అందజేస్తాం. తద్వారా గృహ యజమానులు ఆసక్తిగా ముందుకొస్తారని, స్థలాల సమస్య కూడా ఉండదని చెప్పాలి. చామంతి, మందారం, మల్లె, లిల్లీ, గులాబీ, తులిప్, కనకాంబరం వంటి మొక్కలను పంపిణీ చేయడంతో పాటు సామూహిక స్థలాల్లో నాటనున్నాం.

–అంకుషావలీ, మున్సిపల్ కమిషనర్, ఇల్లెందు

విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న ఎస్.చలపతిరాజు

ఇల్లెందు: సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న రకరకాల సమస్యలపై విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించాలని జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు కోరారు. శుక్రవారం ఇల్లెందు సింగరేణి స్కూల్‌లో డివిజన్ స్థాయి సైన్స్, గణితం ఉపాధ్యాయులకు 'ఇన్‌స్పైర్ – మనాక్, ఇంటింటా ఇన్నోవేషన్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరగతి గదిలో బోధనకే పరిమితం కాకుండా విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన పెంచడానికి ఉపాధ్యాయులు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇన్‌స్పైర్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎంపికైన ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు మంజూరు చేస్తోందని తెలిపారు. ఇంటింటా ఇన్నోవేషన్ పోటీల్లో ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. తాము కనుగొన్న విషయాన్ని వాట్సాప్ ద్వారా 91006 78543 నంబర్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఏసీఎస్‌ఈ కోఆర్డినేటర్ బి.సంపత్‌కుమార్, జి.సంపత్‌కుమార్, ఎస్.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఇద్దరి ఆత్మహత్య

మండల పరిధిలో వేర్వేరు కారణాలతో శుక్రవారం ఇద్దరు వ్యక్తులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

పాల్వంచ: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని జగ్గుతండాకు చెందిన జాటోతు వినోద్‌కుమార్ (26)కు ఏడాది కిందట వసంతతో వివాహం జరిగింది. కొంతకాలానికి మనస్పర్థలు రావడంతో వసంత పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదు. భార్య కాపురానికి రావడం లేదని మనోవేదనకు గురయిన వినోద్‌కుమార్ శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాల కారణంగా..

పాల్వంచరూరల్: దంపతుల మధ్య కలహాల కారణంగా మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని సంఘం గ్రామానికి చెందిన మందపాటి బాబు (52) శుక్రవారం భార్యతో గొడవపడి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య జ్యోతి, ముగ్గురు కుమార్తెలున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

ప్రాణం తీసిన నేరేడు పండ్లు

చెట్టు పైనుంచి కిందపడి బాలుడు మృతి



భూక్యా సాయితేజ్ మృతదేహం

పాల్వంచరూరల్: నేరుడు పండ్లు తినాలనే కోరిక ఓ బాలుడి ప్రాణాలు తీసింది. రెండు రోజులు స్కూల్‌కు సెలవులు రావడంతో హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన బాలుడు రోడ్డు పక్కన ఉన్న నేరేడు పండ్ల కోసం చెట్టు ఎక్కి.. కొమ్మ విరగడంతో కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన కోడిపుంజుల వాగు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. మాణిక్యారం గ్రామం నుంచి రెండేళ్ల కిందట కోడిపుంజులవాగుకు భూక్య రాము, ఉష దంపతులు వలస వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులుండగా చిన్న కుమారుడు సాయితేజ్ (10) రేగళ్లలోని ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. రెండు రోజులు స్కూల్‌కు సెలవులు రావడంతో శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చి గ్రామ సమీపంలోని కిన్నెరసాని రోడ్డువెంట ఉన్న నేరేడు పండ్లు కోయడం కోసం చెట్టుపైకి ఎక్కాడు. కాయలు కోస్తున్న క్రమంలో కొమ్మ కిందపడ్డాడు. దీంతో సాయితేజ్‌ను స్థానికులు, కుటుంబ సభ్యులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు.

గతంలోనూ ప్రమాదాలు

కిన్నెరసాని రోడ్డులో పునుకుల గ్రామం నుంచి కోడిపుంజులవాగు వరకు రోడ్డుకిరువైపులా నేరేడు చెట్లు ఉన్నాయి. గ్రామంలోని కొందరు బాలురు, యువకులు ఈ సీజన్‌లో నేరేడు చెట్లు ఎక్కి పండ్లు కోసి క్యారీ బ్యాగుల్లో పెట్టి రహదారి వెంట నిలబడి విక్రయిస్తుంటారు. ఈ పండ్లను పర్యాటకులు కేజీ రూ.250 నుంచి రూ.300 వెచ్చించి కొంటున్నారు. ఈ క్రమంలో నేరేడు చెట్లు ఎక్కి కిందపడి పలువురు గాయపడిన ఘటనలు చాలా ఉన్నాయి. శుక్రవారం జరిగిన ప్రమాదంలో సాయితేజ్ మృతిచెందాడు. చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని పలువురు కోరుతున్నారు.

చెట్టు పైనుంచి పడి బాలుడికి గాయాలు



చికిత్స పొందుతున్న బాలుడు

గుండాల: నేరేడు పండ్ల కోసం చెట్టు ఎక్కి కిందపడటంతో బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని చీమలగూడెం గ్రామానికి చెందిన ఈసం ప్రణయ్ మామకన్ను ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల కిందట ఇంటికి వచ్చాడు. గ్రామ సమీపంలోని నేరేడు పండ్ల కోసం చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడటంతో చేయి విరిగింది. నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గుండాల ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అనంతరం 108 రాకపోవడంతో బైక్‌పై ఇల్లెందు తరలించారు. అలాగే, మండల కేంద్రానికి చెందిన మొక్క ఆదినారాయణ కాచనపల్లి బ్యాంకు వద్ద కిందపడడంతో గుండాల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వాహనంలోనే ఖమ్మం తరలించారు.

యువతి అదృశ్యం

ఏన్కూరు: యువతి అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. మండలంలోని భగవాన్‌నాయక్ తండాకు చెందిన యువతి (19) గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బాదావత్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూవివాదంలో పలువురిపై కేసు

పాల్వంచ: భూ వివాదంలో ఘర్షణ పడటంతో పలువురిపై కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని చింతలచెర్వుకట్ట సమీపంలో గొల్లగూడెనకు చెందిన రొడ్డా సీతారాములు తన భూమిలో పోల్స్ పాతుకుంటున్నాడు. పక్కనే ఉన్న ఆత్మలింగేశ్వరాలయానికి చెందిన యల్లావుల కోటేశ్వరరావు, యల్లావుల వెంకన్న, మచ్చా నాగార్జున, యర్రం రవి, కుమార్ తదితరులు అడ్డుకున్నారు. వారి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో సీతారాములు తన కుటుంబ సభ్యులను దూషించారని ఫిర్యాదు చేయడంతో వారిపై ఎస్‌ఐ నరేశ్ కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కూతురిపై దాడి

సుజాతనగర్: భూ వివాదంలో కన్నతండ్రే కూతురిపై దాడికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని మద్రితండా గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భూక్యా జయరామ్‌కు ఏడుగురు కుమార్తెలున్నారు. మూడో కుమార్తె అచ్చమ్మకు కోమటిపల్లి గ్రామానికి చెందిన శంకర్‌తో 20 ఏళ్ల కిందట వివాహం జరిగింది. శంకర్, అచ్చమ్మ దంపతులకు 17 కుంటల స్థలం ఉండగా.. కొంతకాలంగా తండ్రీ కూతుళ్ల మధ్య పొలం గెట్టు విషయంలో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో జయరామ్ కూతురి పొలంలో కొంతభాగం దున్నటంతో ఇదేంటి అని ఆమె ప్రశ్నించింది. దీంతో కోపోద్రిక్తుడైన జయరామ్ కూతురిపై దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తిరుపతిలో నాగారం వృద్ధురాలు మిస్సింగ్

పాల్వంచరూరల్: ఆరు రోజుల కిందట తిరుపతికి వెళ్లిన వృద్ధురాలు తప్పిపోయింది. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన నెమలిపురి రత్నావతి (65), ఆమె కుమారుడు నవీన్, కోడలు సింధుతో కలిసి శనివారం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తిరుపతికి వెళ్లారు. ఆదివారం నాడు తిరుపతిలో దిగి ఓ హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లగా అక్కడ తప్పిపోయింది. చుట్టుపక్కల ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తిరుపతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని కుమారుడు తెలిపారు.

ఇద్దరు బాలకార్మికుల గుర్తింపు

భద్రాచలంఅర్బన్: ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యూబీరోడ్డులోని వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ఇద్దరు బాల కార్మికులను టౌన్ పోలీసులు గుర్తించారు. బూర్గంపాడు మండలంలోని సారపాక గాంధీనగర్‌కు చెందిన ఇద్దరు బాలకార్మికులు భద్రాచలంలోని వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ దుకాణం వద్దకు వెళ్లి చూడగా అక్కడ ఇద్దరు బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా సదరు వస్త్ర దుకాణం యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన లారీ

దుమ్ముగూడెం: మండలంలోని అంజుబాక క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం లారీ అదుపుతప్పి చింతచెట్టును ఢీకొట్టింది. ఎదురుగా ఏ వాహనం రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి చర్లకు డ్రైవర్ రహీం లారీలో ఇసుక లోడ్ చేసుకుని వస్తున్నాడు. ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తుండటంతో అంజుపాక క్రాస్ రోడ్డు సమీపానికి వచ్చాక అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ముందు ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మహిళను దూషించినవారిపై కేసు

దమ్మపేట: మహిళను దుర్భాషలాడుతూ, ఆమె ఇంట్లో వస్తువులను ధ్వంసం చేసిన వ్యక్తులపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని తొట్టిపంపు గ్రామానికి చెందిన మెహర్‌ఉన్నిసా బేగం ఇంట్లోకి ఈనెల 2న అదే గ్రామానికి చెందిన మస్తాన్‌వలీతో పాటుగా మరో ఆరుగురు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి, ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ, టీవీ, రిఫ్రిజిరేటర్‌తో పాటు ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. ఇంటిని ఆక్రమించుకునే ఉద్దేశంతో సదరు వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

రోజుకో మొక్క నాటిస్తాడు..

పర్యావరణ ప్రేమికుడు రాజశేఖర్



డీఎఫ్‌ఓ రంజిత్‌నాయక్‌కు మొక్కలు అందజేస్తున్న రాజశేఖర్ (ఫైల్)



ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్యకు మొక్క అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

కొత్తగూడెంటౌన్: రోజుకో మొక్క నాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాడో సింగరేణి ఉద్యోగి. ఎప్పుడూ తన ద్విచక్రవాహనంలో ఓ మొక్క రెడీగా ఉంటుంది. తెలిసినవారు, మిత్రులు, బంధువులు, అధికారులు ఎవరు కనిపించినా తొలుత మొక్క అందజేసి నాటాలని కోరతాడు. లేకపోతే రోడ్డుపై వెళ్తున్న వాహనాదారులను ఆపి మొక్కలు అందించి నాటాలని వివరిస్తాడు. ప్రతి వాహనదారుడు తమ వాహనాల్లో ఒకటో, రెండో మొక్కలు నిత్యం తీసుకెళ్లాలని, మిత్రులు, బంధువులతో నాటించాలని చెబుతున్నాడు. వాహనంలో నిత్యం మొక్కను తీసుకెళ్లడాన్ని గ్రీన్ మోటార్ వెహికల్ గార్డెన్ అంటూ వినూత్నంగా ప్రచారం చేస్తున్నాడు. ఇలా ప్రతి రోజూ కనీసం ఒక్క మొక్కను నాటడం, నాటించడం తన దినచర్య అని పేర్కొంటున్నాడు. ఇక పెళ్లిళ్లకు, శుభకార్యాలకు బొకేలకు బదులు మొక్కలను అందించాలని ప్రచారం చేస్తున్నాడు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం సీఆర్‌పీ క్యాంప్ నివాసి, సింగరేణిలో సెంట్రల్ వర్క్‌షాపు ఉద్యోగి నూర్వి రాజశేఖర్ కాలుష్య నివారణకు అందరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని ప్రచారం చేస్తున్నారు. ఇంటి నుంచి ఎటు బయలుదేరినా వెంట మొక్క తీసుకెళ్తాడు. కనిపించిన వారితో నాటిస్తాడు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, బస్టాండ్ సెంటర్, రామవరం, సూపర్‌బజార్, విద్యానగర్ కాలనీ, రుద్రంపూర్, గౌతంపూర్‌లతో పాటు పలు ప్రాంతాల్లోని ప్రజలకు, రోడ్లపై వెళ్తున్న వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులతోపాటు ఉన్నతాధికారులకు మొక్కలు అందించిన నాటిస్తున్నట్లు రాజశేఖర్ చెబుతున్నారు.

'పోడు' వసూళ్లపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



విచారణ నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్

ఇల్లెందురూరల్: పోడు పట్టాలకు వసూళ్ల వ్యవహారంపై శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని రొంపేడు గ్రామంలో పోడు పట్టాలు ఇప్పిస్తామంటూ కొందరు డబ్బులు వసూలు చేశారని, పట్టాలు రానివారు, వచ్చిన వారు రెండు రోజుల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై సాక్షి దినపత్రికలో 'పట్టాల పేరుతో అక్రమ వసూళ్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో డీపీఓ లక్ష్మీరమాకాంత్ స్పందించి విచారణకు ఆదేశించారు. డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ శుక్రవారం రొంపేడు గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతోపాటు, ఆరోపణలు ఎదుర్కొంటున్న రొంపేడు సర్పంచ్ అజ్మీర శంకర్, మరో ఇద్దరి నుంచి కూడా లిఖితపూర్వక వాంగ్మూలం తీసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సమగ్ర నివేదిక ఉన్నతాధికారులకు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించి మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాన్వాయ్ అడ్డగింత



వినతిపత్రం ఇస్తున్న రాంబాబు తదితరులు

ములకలపల్లి: ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు నిరసన సెగ తగిలింది. పోడు పట్టాల పంపిణీకి వస్తున్న ఎమ్మెల్యే కాన్వాయ్‌ను సీపీఎం ఆధ్వర్యంలో పోడు సాగుదారులు మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట అడ్డగించారు. రోడ్డుపై బైఠాయించి, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు మాట్లాడారు. సర్వే చేపట్టిన ప్రతీ ఒక్కరికీ పోడు పట్టాలివ్వాలని, గిరిజనేతరులకూ హక్కు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. మాధారం శివారులో పోడు సర్వేకు అధికారులు నోటీసులు జారీ చేసినా.. సర్వే మాత్రం చేయకపోవడంతో పోడుసాగుదారులకు పట్టాలు మంజూరు కాలేదని ఆరోపించారు. న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అధైర్యపడొద్దని, అర్హులందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, గౌరి నాగేశ్వరరావు, పోడు సాగుదారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహనదారుల సమ్మె విరమణ



చర్చల్లో పాల్గొన్న అధికారులు, వాహనదారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో రెండో భూనిర్వాసితులు, మాజీ కార్మికుల కుమారుల ఆధ్వర్యంలో అద్దె వాహనాల సమ్మె శుక్రవారానికి రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్నవారికి, సింగరేణి అధికారుల మధ్య చర్చలు జరిగాయి. వాహనదారులు యూనిట్ రేటు పెంచి సీఎంపీఎఫ్ కట్ చేయాలని, లేనిపక్షంలో తమపై అదనపు భారం పడుతుందని తెలిపారు. యాజమాన్యం తరఫున అధికారులు మాట్లాడుతూ మూడు నెలలు గడువిస్తే ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వారు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జీఎంలు బీఆర్ దీక్షితులు, దామోదర్, ఫైనాన్స్ మేనేజర్ రాజేశ్వరరావు, డీజీఎం (సేఫ్టీ) శ్రీహరి, ఎస్‌ఈ (ఈఅండ్‌ఎం) రామశేషయ్య, వేణుమాధవ్, అశోక్ పాల్గొన్నారు.